గెలుపు కోసం..

కదిలిన కూటమి సైన్యం

- అట్టహాసంగా రాజశేఖరం నామినేషన్
- ఏలూరులో టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ
- ఎమ్మెల్సీ అభ్యర్థి వెంటే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు

ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లు

- చివరిరోజు పోటెత్తిన అభ్యర్థులు
- 59 మంది అభ్యర్థులు .. 72 సెట్లు
- నేడు పరిశీలన.. ఉపసంహరణ గడువు 13.. పోలింగ్ తేదీ 27

7



ఏలూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వస్తున్న కేంద్ర మంత్రి వర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

15న ఐదు రకాల బడులపై విద్యాశాఖ డైరెక్టర్ సమావేశం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జూన్ 12 నుంచి మొదలయ్యే నూతన విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించ తలపెట్టిన ఐదు రకాల బడులపై జిల్లాలో ప్రతిపాదనలు ఒక కొలిక్కి రావడంతో క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకునేందుకు ఈ నెల 15న మధ్యాహ్నం పాఠశాలవిద్య డైరెక్టర్ విజయరామరాజు వీడియో కాన్ఫరెన్సు విధానంలో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. జిల్లాలోని ఎంఈవోలు, నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, డీప్యూటీఈవోలు, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, సభ్యులు, తదితరులందరూ ఈ వీసీకి హాజరుకానున్నారు. ఇప్పటివరకు వున్న ఆరు బడుల విధానం వల్ల ఏర్పడిన సమస్యలు, కొత్తగా ప్రారంభించడానికి ప్రతిపాదించిన ఐదురకాల బడుల వల్ల ప్రయోజనాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అభ్యంతరాలు తదితర విషయాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఐదు రకాల బడులపై జిల్లాలో సవరించిన ప్రతిపాదనల ప్రకారం ప్రాథమిక విద్యారంగంలో ఫౌండేషనల్ స్కూల్స్ 218, మోడల్ ప్రైమరీ స్కూల్స్ 298, బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 843, ప్రాథమికోన్నత పాఠశాలలు 49, హైస్కూళ్లు 204 ప్రారంభయ్యే అవకాశం ఉంది. కలెక్టర్ పరిశీలన, నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేల అనుమతుల తర్వాత కేటగిరీల వారీగా వీటిసంఖ్యల్లో పలుమార్పులు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 197 మంది గైర్హాజరు

ఇంటర్ జనరల్ విభాగం ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఒకేషనల్ ప్రాక్టికల్స్ జరుగుతున్న విషయం విదితమే. సోమవారం జిల్లాలోని 55 కేంద్రాల్లో జరిగిన ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ఉదయం 2,842 మందికి 2,702 మంది, మధ్యాహ్నం 1,947 మందికి 1,890 మంది హాజరయ్యారని, మొత్తం 197 మంది గైర్హాజరైనట్టు ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు.



నారసింహుని కల్యాణం.. కడు రమణీయం

ద్వారకాతిరుమల శ్రీవారి దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, కనకవల్లీ సమేత లక్ష్మి అమ్మవారి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ట్రస్టీ ఎస్‌వి నివృతరావు, స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

6

మమ్మల్ని.. ముంచేస్తారా..?





ముంపులో ఎల్లప్పగూడెం (ఫైల్)

కుక్కునూరు మండలంలో నిర్వాసితుల ఆవేదన

ముంపునకు గురవుతున్నా.. పరిహారం దక్కని నిర్వాసిత గ్రామాలు

క్షేత్రస్థాయిలో వాస్తవ సర్వే చేయాలంటూ డిమాండ్

కుక్కునూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో కుక్కునూరు మండలంలో ముంపునకు గురవుతున్న ఎనిమిది గ్రామాలకు ఇటీవల ప్రభుత్వం పరిహారం చెల్లించింది. కానీ ఏటా గోదావరి వరద వస్తే ముంపునకు గురవుతున్న పలు గ్రామాలకు పరిహారం అందని పరిస్థితి. ఈ గ్రామాలు 45.72 కాంటూరు లెవెల్‌లో ఉండడంతో వారికి పరిహారం అందని పరిస్థితి నెలకొంది. అధికారుల అశాస్త్రీయ సర్వేలతో నిర్వాసితులకు అన్యాయం జరుగుతోం దన్న విమర్శలు విన్పిస్తున్నాయి. ఏటా గోదావరి వరదలకు ముందుగా మండలంలో ఎల్లప్ప గూడెం, బెస్తగూడెం, కౌండిన్య ముక్తి, మాధవరం, సీతారామనగరం, అంబోతులగూడెం, చెరువుకొమ్ముగూడెం, వెంకటాపురం, రావిగూడెం, ముత్యాలమ్మపాడు, గుండంబోరు, యర్రబోరు, లచ్చిగూడెం, ఉప్పరిమద్యగట్ల, కుక్కునూరు బీబ్లాక్, కుక్కునూరు సీ.బ్లాక్, తదితర గ్రామాల పై తీవ్ర ప్రభావం చూపుతోంది. అయినప్పటికి ఈ గ్రామాలేవీ 41.15 కాంటూరులో లేవు. ఇదే క్రమంలో కుక్కునూరు పంచాయతీలోని నల్లగుంట, వంజ్యంవారిగుంపు గ్రామాలు అసలు ముంపు జాబితాలోనే లేవు. దీంతో నిర్వాసితుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. 2022 గోదావరి వరదలకు మండలంలో దాదాపు అన్ని గ్రామాలు ముంపునకు గురయ్యాయి. మండలం మొత్తం యూనిట్‌గా తీసుకుని పునరావాస పరిహారం చెల్లించాలని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవంగా ఏఏ గ్రామాలు ముంపునకు గురవుతున్నాయో వాటికి పరిహారం చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

తీవ్ర అన్యాయం ..



గోదావరి వస్తే పక్కనే ఉన్న కొండేటివాగు వరదతో పాటు గోదావరి వరద మమ్మల్ని ముంచెత్తుతాయి. పోలవరం ప్రాజెక్టు కడితే మా గ్రామం మునగదని చెప్పడం అధికారులకే తెలి యాలి. మాకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. మా గ్రామాన్ని ముంపు గ్రామాల జాబితాలో చేర్చాలి.

- కొవ్వాసి నాగార్జున, వంజ్యంవారిగుంపు

మా బతుకులంటే అంత చులకన..!



వరద ముంపునకు ముందుగా మునిగే గ్రామాల్లో మా గ్రామం ఒకటి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగితే మా గ్రామం మునగదంటా ఇదెక్కడి సర్వేనో..? మా గ్రామాన్ని రెండో జాబితాలో తొలగించారు. భూములకే పరిహారం ఇచ్చారు. ముంపులో ఎలా ఉండాలి. న్యాయం చేయాలి.

- వంజ్యం రాజమ్మ. వంజ్యంవారిగుంపు

95 శాతం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కడుపులో నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరిగింది. జిల్లాలోని 62 పీహెచ్‌సీలు, 18 అర్బన్ పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 3,99,425 మంది చిన్నారులు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలన్న లక్ష్యంలో 3,95,180 మందికి (95శాతం) మింగించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, జిల్లా మేనేజర్ బొప్పన నరేష్ తెలిపారు. సోమవారం పాఠశాలలకు గైర్హాజరైన విద్యార్థులకు మాత్రలు అందజేసేందుకు ఈ నెల 17న మాప్ అప్ రౌండ్‌ను నిర్వహిస్తామన్నారు. నగరంలోని రిజర్వ్ పోలీస్‌లైన్ అంగన్‌వాడీ కేంద్రం, సురేష్‌చంద్ర బహుగుణ పోలీసు స్కూలులో బాలబాలికలకు డీఎంహెచ్‌వో మాత్రలను పంపిణీ చేశారు.



ఏలూరులో విద్యార్థులకు మాత్రలను మింగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని

మంచినీటి చెరువులకు కాల్వల నీరు



ఏలూరు సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వేసవిలో గ్రామాలు, పట్టణాల్లో మంచినీటి సమస్యలు తలెత్తకుండా జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ చర్యలు చేపట్టింది. ఏటా మాదిరిగానే గోదావరి, కృష్ణా కాల్వలకు నీరు విడుదల చేయగానే చెరువులను నీటితో నింపే కార్యక్రమం జరుగుతూ ఉంటుంది. ఈ ఏడాదీ ఇదే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో మొత్తం ఎస్‌ఎస్ ట్యాంక్ (చెరువులు)లు 236 ఉన్నాయి. ఇందులో ప్రధానంగా గోదావరి బేసిన్‌లో 77 చెరువులు ఉండగా కృష్ణా బేసిన్‌లో 159 చెరువులు ఉన్నాయి. వీటిలో నీటిని నింపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. గోదావరి కాల్వల నీటిని చెరువుల్లో నింపే కార్యక్రమం కొనసాగుతోంది. గోదావరి బేసిన్‌కు సంబంధించి భీమడోలు మండలంలో 18 చెరువులుండగా ఇప్పటికే ఐదు చెరువులు 75 నుంచి 90 శాతం వరకు నింపారు. ఉంగుటూరు మండలంలో 15 ఉండగా 13, నిడమర్రు మండలంలో 21కి 20, దెందులూరులో 18 చెరువులకు 4, ఏలూరు రూరల్ మండలలో 5 చెరువులకు 4 చెరువులు 75 శాతం నుంచి 90 శాతం వరకు నీరు నింపినట్టు ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ చెబుతోంది.

ఇక కృష్ణా బేసిన్‌కు సంబంధించి ఆగిరిపల్లి మండలంలో ఒక చెరువు ఉండగా ఆ చెరువులో 25 శాతం కన్నా తక్కువగానే నీరు నింపారు. ఏలూరు మండలంలో 8 చెరువులు ఉండగా ఒక చెరువు 90 శాతం కన్నా ఎక్కువగా, ఏడు చెరువులు 75 నుంచి 90 శాతం వరకు నింపారు. కైకలూరులో 23, కలిదిండిలో 28, మండవల్లిలో 27, ముదినేపల్లిలో 41, పెదపాడులో 31 చెరువులు ఉండా వీటిని నింపాల్సి ఉంది.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు నగరంలోని డివిజన్‌లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజలే అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లే కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి శ్రీకారం చుట్టింది. 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం ద్వారా మంగళవారం ఉదయం 11-12 గంటల మధ్య

70136 20539

నెంబరుకు ఫోన్ చేయండి. నగర పాలక సంస్థ పరిధిలోని డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను ఏలూరు నగర కమిషనర్ భానుప్రతాప్ దృష్టికి తీసుకురండి. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటారు.

బర్డ్‌ఫ్లూ కలకలం

- పెరవలి మండలం కానూరు పౌల్ట్రీల్లో నిర్ధారణ
- భయాందోళనలో ప్రజలు





కానూరు అగ్రహారంలో చనిపోయిన కోళ్లను పాతిపెడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్/ ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పౌల్ట్రీల్లో 1.15 కోట్ల కోళ్లలో ఇప్పటి వరకు సుమారు 30 లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి ఈ వ్యాధి ఎక్కడ నుంచి వచ్చి తమ ప్రాణాల మీదకు వస్తుందో అని ప్రజలు భయాందోళనలకు లోనవుతు న్నారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని రామకృష్ణా పౌల్ట్రీలో కోళ్లకు బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1) వైరస్ సోకింది. ఇది ఏవీఎన్ ఇన్‌ఫ్లూయేంజాలో ఒక రకం. కానూరు అగ్రహారంలో మూడు పౌల్ట్రీల్లో మొత్తం 64 వేల కోళ్లకు సుమారు 62 వేలు చనిపోయాయి. కాకినాడకు చెందిన లేబొరేటరీ సిబ్బంది పరీ క్షించి 83 నమూనాలు మధ్రప్రదేశ్ రాష్ట్రం భోపాల్ నేషనల్ హైసెక్యూరిటీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబొరేటరీకి పంపించారు. మూడు చనిపోయిన కోళ్లు, 40 కోళ్ల ముక్కు టెస్ట్, మరో 40 కోళ్ల రెట్ట నమూనాలు పంపించారు. చనిపోయిన మూడు కోళ్లలో రెండు కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై అన్ని మాంసం దుకాణాలు తని ఖీ చేస్తున్నారు. పశ్చిమ గోదావరిలో తాడేపల్లిగూడెం సమీపంలోని బాదంపూడి, తణుకు సమీపంలోని వేల్పూరులో కోళ్లు చనిపోవడంతో నమూనాలు పంపించారు.

ఆందోళన చెందవద్దు మంత్రి దుర్గేష్

కోళ్ల మృత్యువాతతో ప్రజలు ఆందోళన చెందవద్దు. కానూరు అగ్రహారంలో 50వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. మిగిలిన కోళ్లకు వైరస్ సోకకుండా అధికార బృందం ముందుజాగ్రత్తలను చేపట్టింది. గ్రామం, పౌల్ట్రీ ఆవరణలో అధికారులు శానిటేషన్ చేపట్టారు. కొద్దిరోజుల పాటు గ్రామస్థులు చికెన్, గుడ్లు తినవద్దు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కొద్దిరోజులు చికెన్.. గుడ్లు తినవద్దు

బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. కొద్దిరోజుల పాటు చికెన్, గుడ్లు తినవద్దని స్పష్టం చేశారు. రెవెన్యూ, పశుసం వర్ధక, ఫారెస్ట్, పోలీస్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి కానూరు అగ్రహారం గ్రామానికి 10 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ గ్రామంలో ఒక కిలోమీటరు మేర రెడ్ జోన్, 10 కిలోమీటర్ల పరిధిలో సర్వే లెన్స్ జోన్‌గా ప్రకటించారు. పోలీసులు 144, 133 సెక్షన్లు అమల్లోకి తెచ్చినట్టు చెప్పారు. ఇంటింట సర్వే నిర్వహించి ప్రజల్లో బర్డ్‌ఫ్లూ లక్షణాలపై ఆరా తీసి వైద్య సహాయం అందించాలన్నారు. రాజమహేంద్ర వరం, కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కానూరు అగ్రహారంలో పక్షుల వేట

కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో గ్రామంలో కిలోమీటరు మేర ఏరకమైన పక్షులున్నా వెంటనే చంపి పాతి పెట్టాలని అధికారులు ఆదేశాలిచ్చారు. బర్డ్‌ఫ్లూ సోకితే వ్యాక్సిన్ లేదు. వ్యాధి వ్యాప్తి చెందకుండా కోళ్లు, బాతులు, ఇతర పక్షులను చంపి పాత డమే మార్గమని అధికారులు చెబుతున్నారు. చంపిన పక్షులు, కోళ్లను ఒక్కో గోతిలో 1800 చొప్పున పాతి పెట్టేయాలని ఆదేశించారు.



సి- ఆర్మ్‌ఫ్లోరోస్కోప్ ఎక్స్-రే మిషన్ పరిశీలిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో సి-ఆర్మ్ ఫ్లోరో స్కోప్ ఎక్స్-రే మిషన్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నూతనంగా రూ.40 లక్షల ఖరీదైన సి-ఆర్మ్ ఫ్లోరో స్కోప్ ఎక్స్-రే మిషన్ సోమవారం నుంచి వినియోగంలోకి వచ్చింది. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ రోజుకు ఐదు నుంచి పదిమంది రోగులకు శస్త్ర చికిత్సలను చేయవచ్చన్నారు. ప్రస్తుతం ఎముకలు, వెన్నుపూస శస్త్ర చికిత్సలకు ఉపయోగపడుతుందని, ఆపరేషన్ సమయంలోనే వాస్తవంలో ఎముకల దృశ్యాలను చూసి సరి చేయవచ్చన్నారు. గుండె వైద్య నిపుణులు కేత్ ల్యాబ్‌లో గుండె రక్తప్రసారం లోపాలు కనిపెట్టడానికి చేసే ఆంజో గ్రామ్స్ పరీక్షల్లో, స్టంట్ వేయడంలో ఉపయోగించ వచ్చన్నారు. సీఆర్మ్ పరికరం పాతదై మరమ్మతులకు రావడంతో కొత్త యంత్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డాక్టరు వంశీ, డాక్టర్ ధన్య శ్రీ, డాక్టర్ హేమలత పాల్గొన్నారు.



చెత్తలోని వ్యర్థాలను వేరు చేస్తున్న యంత్రం

చెత్త సమస్యకు చెక్ !

తణుకులో కరిగిన డంపింగ్ యార్డు కొండ

వ్యర్థాలు వేరుచేసే పనికి శ్రీకారం

కాంట్రాక్టు కార్మికుల కోసం టెండర్లు

తణుకు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలోని డంపింగ్ యార్డులో వచ్చే రోజువారీ చెత్తతో పెద్ద కొండను తలపించేలా ఉండేది. ఒకప్పుడు చెత్త సమస్యను పరిష్కరించలేక ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయి. స్వచ్ఛభారత్‌లో భాగంగా డంపింగ్ యార్డులో ఉన్న వ్యర్థాలు వేరు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో సమస్య కొలిక్కి వచ్చింది. సంబంధిత కాంట్రాక్టరుకు వ్యర్థాలు వేరు చేసి వాటిని ఎరువుగా మార్చడానికి ప్రభుత్వం టన్నుకు రూ.500తో పాటు స్థానిక మున్సిపాల్టీలు రూ.200 కలిపి రూ.700 చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో కాంట్రాక్టు సంస్థ కొండలా ఉన్న చెత్తను కరిగించారు.

రోజూ 40 టన్నుల చెత్త

పట్టణంలోని 34 వార్డుల నుంచి రోజూ 40 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. పది ట్రాక్టర్లు, 35 వీల్ బార్‌ల ద్వారా చెత్త సేకరిస్తున్నారు. పట్టణంలో 34 వార్డులను కలిపి 7 జోన్‌లుగా విభజించారు. ఆయా జోన్లకు పారిశుద్ధ్య కార్మికులను కేటాయించారు. డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను వేరు చేసే క్రమంలో పెద్ద ప్రాసెస్సే జరుగుతోంది. యంత్రాల సాయంతో పలురకాలు వ్యర్థాలను వేరు చేస్తున్నారు. వాటిలో టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఇనుప వస్తువులు, గాజులు వంటి వేరు చేస్తారు. అమ్మేందుకు అవకాశం ఉన్న వాటిని కాంట్రాక్టు సంస్థ విక్రయం చేసుకుంటుంది. మిగిలిన వాటిని మొత్తని మట్టి (ఎరువుగా) తయారు చేస్తారు. వ్యర్థాల ద్వారా వచ్చిన మెత్తని మట్టిని డంపింగ్ యార్డులోని ఎనిమిది అడుగుల లోతులో గొయ్యి తీసి అందులో వేస్తున్నారు. ఎవ్వరైన మట్టి కావాలంటే వారికి ఇస్తున్నారు.

కార్మికుల కోసం టెండర్లు పూర్తి

కాంట్రాక్టు పద్ధతిన పారిశుద్ధ్య కార్మికుల టెండర్లు ప్రక్రియ పూర్తయ్యింది. గతంలో రెండుసార్లు పిలిచినప్పటికీ ముందుకు రాలేదు. ప్రస్తుతం ఒక సంస్థ ముందుకు రావడంతో తొందర్లోనే కార్మికులను తీసుకునే అవకాశం ఏర్పడింది. కార్మికునికి నెలకు రూ.15 వేలతో పాటు పీఎఫ్ ఉంటుంది. ప్రస్తుతం పట్టణంలో 158 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో 30 మంది రెగ్యులర్ కాగా మిగిలిన వారంతా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్నారు. మరో 30 మంది కార్మికులు రానున్నారు. దీంతో కార్మికుల కొరత తీరనుంది.

నిలిచిన క్లాప్ ఆటోలు

చెత్త సేకరణకు గతంలో ఉపయోగించిన క్లాప్ ఆటోలను నిలిపివేశారు. వారికి పెట్టే ఖర్చుకు తగిన పని చేయడం లేదు. దీంతో మున్సిపాల్టీకి ఆర్థికంగా భారంగా మారింది. ఎన్నివిధాలుగా సరిచేయాలని ప్రయత్నించినా కార్మికులు తీరులో మార్పు కనిపించలేదు. దీంతో క్లాప్ ఆటోలను ఆపేయాలని నిర్ణయించారు. వాటి స్థానంలో వీల్ బార్‌లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇంటింటికి వెళ్లి తడి. పొడి చెత్తను సేకరించనున్నారు.

త్వరలోనే కార్మికులను తీసుకుంటాం



ప్రభుత్వ అనుమతి పొంది టెండర్లు ప్రక్రియ పూర్తయిన కాంట్రాక్టు కార్మికులను త్వరలోనే తీసుకుంటాం. కార్మికులకు నెలకు రూ.15 వేలతో పాటు పీఎఫ్ ఉంటుంది. మూడు నెలల వ్యవధి కాంట్రాక్టు ఉంటుంది. తర్వాత మరలా ప్రభుత్వ అనుమతితో పొడిగించడమా లేదా అనేది నిర్ణయిస్తారు

- టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



మొగల్తూరు పాఠశాలకు వేసిన సీసీ రోడ్డు

పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు



మొగల్తూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఎంతో చరిత్ర కలిగిన మొగల్తూరులోని పెన్మత్స రంగ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి , మౌలిక సదుపాయాల కల్పనకు పాఠశాల పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. 1958లో స్వర్గీయ పెన్మత్స రంగరాజా సుమారు ఆరు ఎకరాల స్థలాన్ని దాతృత్వంగా ఇవ్వడంతో ఆయన పేరిట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నిర్మించారు. ఈ పాఠశాలలోనే చిరంజీవి, ఆయన సోదరుడు నాగేంద్రబాబు, సినీ నిర్మాత సూర్యనారాయణరాజు, షార్ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, ఆర్మీకల్నల్ వీకే రావ్, కల్నల్ విఠల్, వింగ్ కమాండర్ జయకర్ ఇలా ఎందరో చదువుకున్నారు. 1958లో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల ప్రాంగణం అంతా చినుకు పడితే మునిగిపోతోంది. పూర్వ విద్యార్థులు విరాళాలు సేకరించి సుమారు 70 శాతం పాఠశాల ప్రాంగణాన్ని సుమారు రూ.4 లక్షల వ్యయంతో పూడ్చారు. పాఠశాల వెనుక గల స్థలంలో సర్వశిక్ష అభి యాన్ పథకం నుంచి రూ.25 లక్షల వ్యయంతో 2005లో నూతనంగా మరో భవనాన్ని నిర్మించారు. ఆ భవనానికి విద్యార్థులు వెళ్ళేందుకు అనువుగా పాఠశాలలో 1977-78 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 86 మీటర్ల కంకర రహదారి ఏర్పాటు చేశారు. పాఠశాల దక్షిణ భాగంలో రూ.70 వేలతో కొత్త గేటు నిర్మించారు. స్థానిక మండల పరిషత్ స్పందించి ఆర్థిక సంఘ నిధులు రూ.6.25 లక్షలతో ఈ 86 మీటర్ల రహదారిని సీసీ రోడ్డుగా మార్చారు.

కొబ్బరి అధరహో



గణపవరంలో కొబ్బరి కాయలను ఎగుమతి చేస్తున్న కూలీలు

కొబ్బరి ధర అదిరింది. మును పెన్నడూ లేనివిధంగా రికార్డుస్థాయి ధర పలుకుతోంది. జనవరి నెల ప్రారంభం నుంచి కొబ్బరి ధర పెరగడం అటు కొబ్బరి రైతులు, ఇటు వ్యాపారస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాలో ఉద్యాన పంటల్లో అగ్రస్థానంలో నిలిచిన కొబ్బరి పంటకు మంచిరోజులు వచ్చాయని కొబ్బరి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో ధర

దిగుబడులు భేష్

ఊపందుకొన్న మార్కెట్

వెయ్యి కాయల ధర రూ.12 వేలు

నిడమర్రు ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) :కొంత కాలంగా కొబ్బరి రైతుల పరిస్థి పూర్తిగా నిరాశజనకంగా ఉండేది. నాలుగు సంవత్సరాల నుంచి తెల్లదోమ ప్రభావంతో కొబ్బరి తోటల్లో దిగు బడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఒకప్పుడు 3 వేల నుంచి నాలుగు వేల వరకు కొబ్బరి కాయలు ఎకరానికి దిగబడి రాగా వైట్ ఫ్లై ప్రభావంతో దిగుబడులు పూర్తిగా పడిపోయాయి.ఎకరాకు దిగబడి 2 వేల లోపు పడి పోవడంతో కొబ్బరి తోటలను కౌలుకు తీసుకునేవారు కరువయ్యారు. కానీ నేడు పరిస్థితి మారింది. తెల్లదోమ కొంతమేర నివారించబడడంతో దిగు బడులు కూడా పెరిగాయి.ఎకరాకు 3 వేల కాయలు పడుతున్నాయి. నేడు కొబ్బరితోట దిగబడులు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతు కళ్లల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.

రైతుల్లో ఆనందం

మునుపెన్నడూ లేనివిధంగా కొబ్బరి ధర పలకడంతో రైతు కళ్లల్లో ఆనం దం వెల్లివిస్తోంది. ముఖ్యంగా రైతు వద్ద ఒకప్పుడు వెయ్యికాయలు కేవలం 2 వేల నుంచి 3 వేల వరకు మాత్రమే ధర పలికేది. నేడు ధర అమాంతం ఎరగడంతో లాభాల బాట పట్టినట్లయింది. నాలుగేళ్లలో పొందిన నష్టాల నుంచి గట్టెక్కుతామనే ఆశతో రైతులు ఉన్నారు, ఉమ్మడి జిల్లాలో దెందులూరు, ద్వారకాతిరుమల, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, భీమడోలు, పాలకొల్లు, పోడూరు, యల మంచిలి, ఆచంట మొగల్తూరు మండలాల్లో ఎక్కువగా కొబ్బరి సాగు చేస్తున్నారు. 50 నుంచి నుంచి 60 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇక్కడ నుంచి ఎక్కువగా గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, బీహార్, ఢిల్లీ రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి అవుతుంది. రోజూ వారీ 60 నుంచి వందకు పైగా లారీల్లో కొబ్బరి ఎగుమతి చేస్తుంటారు..



- రైతు ధర వెయ్యి కొబ్బరి కాయలు (తీత కూలీ ఖర్చు లేకుండా) రూ.6,000, (చెట్టు నుంచి కాయలు దింపి గుట్టగా వేస్తే) రూ.9,000
- వ్యాపారి ఎగుమతి ధర (కాయలు సేకరించి వలిపించి ఎగుమతి చేస్తే) రూ.12,000

మార్కెట్ పెరగడానికి కారణం

మార్కెట్‌లో కొబ్బరి ధర గతంతో పోల్చితే వంద శాతం పెరిగింది. కొబ్బరికి ప్రధాన ఎగుమతి రాష్ట్రాలైన కేరళ, తమిళనాడుల్లో ఇటీవల కురిసిన కుంభవృష్టి వర్షాలు, వరదలు వల్ల ఆయా ప్రాంతాలలో కొబ్బరి కాయల దిగుమతి బాగా తగ్గిపోయింది. ఉత్తరాది మార్కెట్‌లో కేరళ, తమిళనాడు కొబ్బరికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. నార్త్‌లో ఓ పక్క పండుగలు, మరోపక్క కుంభమేళా జరగడంతో కొబ్బరికి డిమాండ్ బాగా పెరిగిపోయింది. దీంతో దక్షిణాదిన కేరళ, తమిళనాడుల్లో డిమాండ్‌కు తగ్గ దిగుబడులు లేకపోవడంతో ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ వచ్చి మంచి ధర పలుకుతోంది. ఏది ఏమైనా కొబ్బరికి మునుపెన్నడూ లేనంత ధర పలకడంతో తీవ్ర నష్టాలలో ఉన్న రైతన్నలకు ఊరట లభించింది.

ఈ ఏడాది బాగుంది



కొంతకాలంగా కొబ్బరి రైతులు తీవ్రనష్టాలలో ఉన్నారు. ఈ సంవత్సరం ఆంధ్రా కొబ్బరికి మంచి డిమాండ్ వచ్చింది. గత ఐదేళ్లలో ఎన్నడూ ఇటు వంటి ధర చూడలేదు. తోటల్లో రైతు వద్ద పచ్చి కొబ్బరి కాయ ఆరు రూపాయలు చేసి ఇస్తున్నారు. కొంత కాలంగా కొబ్బరిని తెల్లదోమ, కొమ్ము పురుగు సోకడం వల్ల తీవ్రంగా నష్టపోయాం. దిగుబడులు కొంతమేర తగ్గినప్పటికీ ధర ఆశాజనకంగా ఉండడంతో కోలుకోగలుగుతున్నాం.

- చిలుకూరి ధర్మారావు , కొబ్బరి రైతు ద్వారకాతిరుమల

మన కాయలకు డిమాండ్



పదేళ్లుగా కొబ్బరి కాయల వ్యాపారం చేస్తున్నాను. తెల్లదోమ వచ్చినప్పటి నుంచి కాయ దిగుబడులు పూర్తిగా తగ్గి పోయాయి. మార్కెట్ కూడా ఆశా జనకంగా లేకపోవడంతో పూర్తి లాభాలు వచ్చేవి కావు. ఈ సంవత్సరం తమిళనాడు, కేరళ ప్రాంతాల్లో వరదలు, విస్తారంగా కురిసిన వర్షాల వల్ల దిగుబడులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతాల్లో దిగుబడులు లేకపోవడంతో మన కాయకు డిమాండ్ వచ్చి మంచి ధర పలుకుతోంది.

- చేవెళ్ల వెంకట రామారావు, కొబ్బరి వ్యాపారి, గణపవరం





స్వామివారి కల్యాణం వీక్షిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, ట్రస్టీ నివృతరావు తదితరులు.. కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కల్యాణ వైభోగమే

అట్టహాసంగా నరసింహస్వామి కల్యాణ మహోత్సవం

భక్తజన సంద్రమైన సుందరగిరి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిమాన్వితుడిగా సుందరగిరిపై విరాజిల్లుతోన్న లక్ష్మీ నరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవం సోమవారం ఉదయం వైభవంగా జరిగింది. సుందరగిరి పరిసరాలు భక్తజనుల నృశింహ నామస్మరణలతో మారుమోగాయి. చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని ఈ ఆలయంలో ముందుగా కనకవల్లీ సమేత లక్ష్మీ అమ్మవారితో నరసింహుని ఉత్సవ మూర్తులను పల్లకి వాహనంలో ఉంచి అట్టహాసంగా కొండ దిగువనున్న కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు.ప్రత్యేకంగా అలంకరించిన పచ్చిపూల కల్యాణవేదికపై ఉన్న సింహా సనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు కల్యాణ తంతును ప్రారంభించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ట్రస్టీ ఎస్‌వీ నివృతరావు, స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింప చేశారు. పండితుల వేదమంత్రోచ్ఛరణలు, బాజాభజంత్రీల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలు ఘనంగా జరిగాయి. గర్భాలయంలో కొలువైన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరిం చారు. పలువురు మహిళలు పాలపొంగళ్లను కొండపై వండి స్వామివారికి స్వయంగా నివేదన చేశారు. భారీ అన్న సమారాధన జరుగగా వేలాదిగా భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. టీడీపీ నాయకులు లంకా సత్తి పండు, మల్లిపెద్ది వెంకటేశ్వర రావు, పోలిన శ్రీనివాసరావు, మద్రాస్ రాము, నాదెళ్ల సురేంద్రనాథ్ చౌదరి, పాకల పాటి గాంధీ, ఏపూరి దాలయ్య, డి.వీరాస్వామి, ఓం ప్రకాష్ చౌదరి, రేగంటి రాంబాబు, మాజీ జడ్పీటీసి మొగతడకల లక్ష్మీరమణి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి నివేదనకు పొంగలి వండి తెస్తున్న భక్తులు

జాతీయ స్థాయి క్రీడలకు టెక్నికల్ అఫీషియల్‌గా శేఖర్‌రాజు



భీమవరం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ నిర్వహిస్తున్న 38వ జాతీయస్థాయి పోటీల్లో మల్కంబ్ క్రీడకు సంబంధించి భీమవరం చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు జీపీసీ శేఖర్ రాజు టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. శేఖర్ రాజుకు డీఎన్ఆర్ కాలేజీ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ నరశింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, కరస్పాండెంట్ కూనపరాజు రామకృష్ణంరాజు, మల్కంబ్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

12న అంతర్వేదికి 8 ఆర్టీసీ సర్వీసులు

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి బుధవారం డిపో నుంచి ఎనిమిది సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం సుబ్బన్నరెడ్డి తెలిపారు. పౌర్ణమి సందర్భంగా పాలకొల్లు డిపో నుంచి ప్రతి అరగంటకు ఈ సర్వీసులు నడుస్తాయన్నారు. ప్రయాణీకుల రద్దీని బట్టి సర్వీసులను మరింత పెంచుతామన్నారు.

మానవత్వమా.. మేలుకో !



తాడేపల్లిగూడెం రూరల్ (ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురంలో సంక్రాంతి సమయంలో మద్యం సేవించి బైక్‌పై నుంచి జారిపడి ఒక యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తం కారుతూ మూలుగుతూ కనిపించాడు.అయితే అతడిని ఆసుపత్రి తీసుకెళ్లే ధైర్యం ఎవరూ చేయడం లేదు.. ఇంతలో మీడియాలో పనిచేసే ఒక వ్యక్తి ముందుకు వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు 108కు ఫోన్‌చేసి అంబులెన్స్ ఎక్కించాడు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తే అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు తరలించారు. పదిరోజులు చికిత్స తర్వాత కోలుకున్నాడు. సమయానికి ఆ వ్యక్తి స్పందించడంతో నిండు ప్రాణం నిలిచింది.

ప్రాణాలు కాపాడితే రూ.25 వేలు

నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతుంటాయి. కొన్నిచోట్ల సమాచారం ఇచ్చే వ్యక్తులు ఉంటే మరి కొన్ని చోట్ల ముందుకు వచ్చి క్షతగాత్రుడిని ఆసుపత్రికి చేర్పించే ధైర్యం చేయలేని వారు ఉంటున్నారు. ఆపదలో ఉన్న వారిని కాపాడాలనే మనసు ఉన్నా అనవసరంగా పోలీసు కేసులో ఇరుక్కోవాల్సి వస్తుందేమో..? కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్న భయంతో ముందుకు రావడం లేదు. ఇలాంటి సంఘటల్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం గుడ్ సమరిటన్ పథకం తీసుకు వచ్చింది. క్షతగాత్రుల్ని తక్షణమే ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడినవారికి రూ.5 వేలు ప్రోత్సాహం ప్రకటించింది. తాజాగా ఆ మొత్తాన్ని రూ.25 వేలకు పెంచి అమలు చేస్తోంది.



రోజూ ఎక్కడో చోట రోడ్డు ప్రమాదాలు

గాయాలతో కొట్టుమిట్టాడుతున్న వాహన చోదకులు

భయంతో మనకెందుకులే అనుకుంటున్న జనం

సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్తే రూ.25 వేల బహుమతి

కేసుల గురించి భయం వద్దు..



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని, స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందని భయపడాల్సిన అవసరం లేదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఆసుపత్రికి తరలించినా అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదు. రోడ్డు ప్రమాద కేసులకు సాక్షులుగా ఉండాల్సిన అవసరం లేదు.

- ప్రసాద్, ఎస్సై తాడేపల్లిగూడెం రూరల్

ప్రాణాలను కాపాడండి..



మానవత్వంతో ముందుకు వచ్చి ఆపదలో ఉన్న క్షతగాత్రులను ఆసుపత్రికి చేర్చితే ఓ నిండు ప్రాణం కాపాడటంతో పాటు ఆ వ్యక్తిపై ఆధారపడిన ఓ కుటుంబాన్ని కాపాడినట్టే. కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ గుడ్ సమరిటన్ చట్టం ద్వారా నగదు ప్రోత్సాహం పొందడంతో పాటు ప్రాణదాతలు కావచ్చు.

- ఎం.తాతారావు, సూపరింటెండెంట్, తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి

ఎక్కువ మందిని కాపాడితే రూ.లక్ష

రోడ్డు ప్రమాదంలో గాయనపడిన వారికి సాయం అందక సకాలంలో ఆసుపత్రికి తరలించక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రుల్ని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపు) ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిచే అవకాశాలెక్కువని వైద్యులు చెబుతున్నారు. అలా చేసిన వారు పోలీస్ కేసుల భయం లేకుండా గుడ్ సమరిటన్ చట్టం అండగా నిలుస్తుంది. ఎక్కువ మందిని కాపాడితే లక్ష రూపాయలు అదనపు ప్రోత్సాహం అందిస్తారు.

ప్రభుత్వ ప్రోత్సాహం పొందాలంటే..

ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆసుపత్రికి తరలించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే పోలీసులు అధికారికంగా లేఖ ఇస్తారు. ఆధార్ కార్డు బ్యాంకు ఎకౌంట్ వివరాలతో పాటు పోలీస్‌శాఖ, ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి తహసీల్దార్‌కు దరఖాస్తు చేయాలి. రవాణా, రెవెన్యూ, పోలీస్, జాతీయ రహదారుల సంస్థ, ఆర్అండ్‌బీ, అధికారులతో కూడిన కమిటీ గుర్తించి నగదు ప్రోత్సాహానికి ఎంపిక చేస్తుంది.

కదిలిన కూటమి సైన్యం

అట్టహాసంగా రాజశేఖరం నామినేషన్

- టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ
- ఎమ్మెల్సీ అభ్యర్థి వెంటే మంత్రులు, ఎమ్మెల్యే, కూటమి నేతలు



ఏలూరు,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పు- పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఏలూరు కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల అధికారి కె.వెట్రిసెల్వికి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి అశేషంగా తరలివచ్చిన మంత్రులు, కూటమి నేతలు,పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఏలూరు జిల్లా టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయల్దేరారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పేరాబత్తుల రాజశేఖరం, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక మీరైతే పరిష్కరించే మనిషిగా నేను అండగా ఉంటానని రాజశేఖరం భరోసా ఇచ్చాడు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కూటమి బలపర్చిన పేరాబత్తుల రాజశేఖరంను గెలిపిస్తాయన్నారు. కేంద్ర ఉక్కు కర్మాగారాలశాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రులు గొట్టి రవికుమార్, వాసం శెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, రాజమండ్రి పార్లమెంట్ అధ్యక్షులు కేఎస్ జవహర్, మాజీ హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, పొలిట్ బ్యూరో సభ్యురాలుతోట సీతారామలక్ష్మి, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, వత్సవాట్ల ధర్మరాజు, సొంగా రోషన్ కుమార్, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, బొమ్మిడి నాయకర్, పులవర్తి రామాంజనేయులు, మిరియాల శిరీష, సుబ్బరాజు, జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీలు ఎంఏ షరీఫ్, వేపాడ చిరంజీవి, దువ్వారపు రామారావు, మాజీ మంత్రులు పీతల సుజాత, ఏపీఐడీసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, జనసేన నుంచి ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఉండి జనసేన ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, కొల్లేరు నాయకులు సైదు సత్యనారాయణ, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ర్యాలీ అనంతరం సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు, చిత్రంలో జవహర్, సుజాత, సీతారామలక్ష్మి, ఎమ్మెల్యేలు . నామినేషన్ కార్యక్రమంలో అభ్యర్థి రాజశేఖరం, పల్లా, మంత్రులు నిమ్మల, మనోహర్, వర్మ

ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లు

- 59 మంది అభ్యర్థులు .. 72 సెట్లు
- నేడు పరిశీలన..
- ఉపసంహరణకు గడువు 13

ఏలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గడువు చివరి రోజు సోమవారం దరఖాస్తులు పోటెత్తాయి. చివర రోజు ఒక్కరోజే పెద్ద ఎత్తున అభ్యర్థులు ముహూర్తాలు చూసుకుని రావడంతో ఏలూరు జిల్లా కలెక్టరేట్ కిటకిటలాడింది. సోమ వారం 29 మంది 48 సెట్ల నామినేషన్ల వేశారు. దీంతో మొత్తం మీద 59 మంది 72 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ నెల 11న నామినేషన్ పరిశీలన చేస్తారు. 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఇదే రోజు సాయంత్రం బరిలో ఉన్న అభ్యర్థుల జాబి తాను ప్రకటిస్తారు. తర్వాత గుర్తుల కేటాయి ంపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయి. 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

చివరి రోజు నామినేషన్లు ఇలా..

పేరాబత్తుల రాజశేఖరం (కోనసీమ, కూటమి అభ్యర్థి), ఎం శాస్త్రులు(రావులపాలెం), ఎం.శ్రావణి(రావులపాలెం), ఎన్. రామకృష్ణ (అత్తిలి) ఈయన తరఫున బెంజ్‌మెన్‌రాజు నామినేషన్ వేశాడు. కె.జీవ దేవాదయాకర్ (చింతలపూడి), ఏళ్ల దొరబాబు (అమలాపురం), భావన ధాన్యలక్ష్మి (తాడేపల్లిగూడెం), ములకల శ్రీనివాస్ (ఏలూరు, నాల్గోసెట్), దిడ్ల రాఘవరావు (కోనసీమ), బి. శ్రీనివాస్ (చింతలపూడి), బి.శ్రీరామమూర్తి(రాజమండ్రి), షేక్ హుస్సేన్(ఏలూరు), షేక్ అస్లాం(కాకినాడ), ఆర్.ముఖేష్‌బాబు (దెందులూరు), జేటీ రామారావు (రాజమండ్రి), పి.లీలా గణేష్(ఏలూరు), ఎం.అంబేద్కర్(రామచంద్రపురం), కె.లావణ్య (నరసాపురం), కె.నాగేశ్వరరావు (రాజమండ్రి), కృష్ణమోహన్ (కాకినాడ), పి.సుప్రజా (నర్సాపురం), కె.గౌతమ్‌బాబు (అమలాపురం), వీవీ సత్యనారాయణ (జగ్గన్నపేట), పేరాబత్తుల సత్యవాణి (కాకినాడ), వి.శ్రీనివాసరావు (పిఠాపురం), నాగభూషణ పద్మ, దాఖలు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలిగా కె.సునీత రాక



ఏలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు పరిశీలకురాలిగా కె.సునీత సోమవారం ఏలూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకురాలు కె.సునీతకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మొక్కను అందించి స్వాగతం పలికారు. సునీతను జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికలపై సునీత జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రింగ్స్‌తో ఆవుకు శస్త్రచికిత్స

- విరిగిన ఎముకను సరిచేసిన వైద్యులు
- మూడు రోజుల్లోనే సాధారణ స్థితికి ఆవు



ఆవు కాలుకి రింగ్స్ తొడిగి ఉన్న దృశ్యం



తణుకు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తణుకులోని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థలో ఆవుకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. విరిగిన కాలుకు రింగ్‌లు అమర్చి నయం చేశారు. రాష్ట్రంలో ఇలాంటి శస్త్ర చికిత్స అరుదని వైద్యులు తెలిపారు. భీమవరం రూరల్ మండలం చినఅమిరం గ్రామానికి చెందిన భూపతిరాజు బుద్ధ వెంకట సీతారామరాజుకు చెందిన ఆవుకు గాయమైంది. రేకుల షెడ్డులో కట్టిన ఆవుకు వారం క్రితం గోడకు ఆవు కాలు తగిలి విరిగింది. కాలు గుత్తి వద్ద ఎముక బయటకు వచ్చేసింది. ఆవు నడవలేని స్థితికి చేరుకుంది. తణుకులోని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థలో వైద్యులను సీతారామరాజు సంప్రదించి వాహనంలో ఆవును ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆవును పరిశీలించిన వైద్యులు రింగ్‌లను అమర్చాల్సి ఉంటుందని తెలిపారు, వాటి ఖరీదు అధికంగా ఉండడంతో తాను భరించలేనని రైతు చెప్పడంతో పశువైద్యులు తణుకు వెటర్నరీ ఇనిస్టిట్యూట్ డవలప్‌మెంట్ సొసైటీని సంప్రదించారు. రింగ్‌లు కొనుగోలు చేశారు. రైతుపై భారం వేయకుండా ఉచితంగా రింగ్స్‌ను అమర్చి శస్త్రచికిత్స చేశారు. రాష్ట్రంలో రింగ్స్ అమర్చి శస్త్రచికిత్స చేయడం ఇదే తొలిసారని, మూడు రోజుల్లో సాధారణ స్థితికి చేరుకుందని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రీధర్ తెలిపారు.



రూ.7.50 కోట్లతో ఏర్పాటు చేసిన హబ్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావు

విద్యుత్ రంగంలో నాణ్యమైన పరిశోధనలు చేయాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పునరుత్పాదక శక్తి వనరులు, విద్యుత్ రంగంలో నాణ్యమైన పరిశోధనలు చేపట్టాలని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అన్నారు. నిట్ ప్రాంగణంలో సోమవారం రూ.7.50 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్ఐఆర్-కామన్ రిసెర్చ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణారావు మాట్లాడుతూ నిట్ ఒక విద్యాసంస్థ మాత్రమే కాదని వినూత్న ఆవిష్కరణకు కేంద్ర బిందువు అన్నారు. ఎవరైతే ఎక్కువ సమయాన్ని ప్రయోగశాలకు కేటాయిస్తారో వారికి కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయన్నారు. రూ.7.50 కోట్ల ప్రాజక్టును ఏపీ నిట్‌కు తీసుకురావడానికి కృషి చేసిన ఆచార్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ శంకర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. డీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ విపిన్ శుక్లా మాట్లాడుతూ దేశంలో సింహభాగం వ్యాపారాలను నిర్వహించేది సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలేనని అవి మరింత పురోగతి సాధించేలా ప్రోత్సహించడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశమన్నారు. నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ కైలాష్‌పెట్కర్, డాక్టర్ రంజిత్ బైర్వా తదితరులు మాట్లాడారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, డాక్టర్ టి.రమేష్, డాక్టర్ రఫి మహ్మద్, డాక్టర్ వినోద్‌కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి మహిళ మృతి

మండవల్లి ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి మహిళ మృతి చెందింది. పుట్టచెరువు గ్రామానికి చెందిన పమిడి సుధ(34) తన భర్త విశ్వేశ్వరతో కలిసి గ్రామంలోని కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. కూలిపనికి వెళ్లి వచ్చిన సుధా మోటార్‌ను వదిలేందుకు వెళ్లగా ఇంట్లో మోటార్ వైర్ పశువులు లాగేయడంతో గడ్డిలో ఉన్న కరెంటువైర్ చూసుకోకుండా పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్రైమ్ కార్నర్

మద్యానికి డబ్బు ఇవ్వలేదని వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి డబ్బులు ఇవ్వడం లేదని మనస్తాపానికి గురైన ఒక వృద్ధుడు పురుగు మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ ఇందిరా కాలనీకి చెందిన శానాపతి బాబూరావు (60)కు భార్య గతంలో మరణించగా ఇద్దరు కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. ఇద్దరు కుమార్తెలను, అల్లుళ్ళను మద్యానికి డబ్బులు అడుగుతూనే ఉంటాడు. లేదంటే చీమల మందో, ఎలుకల మందో నోట్లో వేసుకుని బెదిరిస్తూ ఉంటాడు. సోమవారం మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురైన బాబూరావు తన ఇంటి వద్ద సాయంత్రం పురుగుమందు తాగేశాడు. అతనిని కుమార్తె, అల్లుడు తీసుకురాగా అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వ్యసనాలకు బానిసలై చోరీలు

ఇద్దరి అరెస్టు..మోటార్ సైకిళ్లు, బంగారం స్వాధీనం



తణుకు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్‌లు, మోటారు వాహనాల దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. సోమవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలు తెలిపారు. తణుకు మండలం వీరభద్రపురానికి చెందిన మల్లిపూడి సుధీర్ అలియాస్ నాని, పల్లేటి రాజేశ్ వ్యసనాలకు బానిసలై కొంత కాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలించి వీరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి ఎన్‌ఫీల్డ్ మోటారు సైకిల్, 2 పల్సర్ మోటారు సైకిల్స్‌తో పాటు రూ.13 లక్షల 93 వేల విలువైన 144 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ బి.కృష్ణకుమార్, ఎస్ఐలు కె.చంద్రశేఖర్, సతీశ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం రైల్వే స్టేషన్ దగ్గర రైలు పట్టాలపై సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు వయస్సు కల్గిన ఒక వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. మృతుడు వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారిపడినట్లుగా గుర్తించారు. మృతుని ఎత్తు 5.6 అడుగుల ఎత్తు, తెలుపు రంగు పొడవు చేతులు, తెలుపు రంగు కట్ బనియన్, నీలం రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9989219559కు సమాచారం అందించాలని రైల్వే ఎస్ఐ సైమన్ కోరారు.

ఇంటిలో ఏడు కాసుల బంగారం చోరీ

యలమంచిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తన ఇంట్లో బీరువాలోని లాకరులో దాచుకున్న ఏడు కాసుల బంగారు నగలు కనిపించకుండా పోయాయని గగ్గిపర్రు గ్రామానికి చెందిన వింజమూరి దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.గుర్రయ్య సోమవారం తెలిపారు. బీరువాకు తాళం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్ఐ మూర్తి కుటుంబానికి పోలీసు మిత్రుల అండ

రూ.46.78 లక్షల ఆర్థిక సాయం అందజేత



ఎస్ఐ మూర్తి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పోలీసు మిత్రులు

కె.గంగవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం గ్రామానికి చెందిన ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి (ఏఎస్ఎన్ మూర్తి) ఇటీవల తణుకు పోలీస్ స్టేషన్‌లో మృతి చెందిన సంగతి తెలిసిందే. వారి కుటుంబానికి తాము అండగా ఉంటామని పోలీసు మిత్రులు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం కె.గంగవరంలో మూర్తికి నివాళులర్పించి వారి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి మిత్రులు మాట్లాడుతూ మూర్తి ఎంతో కష్టపడి ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడని తెలిపారు. 2012 పోలీసు శిక్షణలో చురుకుగా ఉండేవాడని తెలిపారు. ఎవరికైనా కష్టం వచ్చిందంటే ఆదుకునేందుకు ముందుండేవాడని తెలిపారు. అకస్మాత్తుగా చనిపోవడంతో అతని భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులను ఆదుకోవాలని నిర్ణయించామన్నారు. అతని ఇద్దరు పిల్లల చదువులు, వారి భవిష్యత్ కోసం రూ.46.78 లక్షల ఆర్థికసాయం చేస్తున్నామని వారు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి 2012 బ్యాచ్ చెందిన 1156 మంది రూ.30లక్షలు ఇద్దరు పిల్లలకు చెందేలా ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా వేశారు. ఇదే విధంగా పశ్చిమ గోదావరి జిల్లా ఎస్.పి. నయీం అస్మి రూ.4 లక్షలు తల్లిదండ్రుల నిమిత్తం, పోలీసు స్క్వాడ్ 27 మంది 1.10 లక్షలు, ఏలూరు జోన్ పోలీస్ అసోసియేషన్‌కు చెందిన 126 మంది 10.58 లక్షలు భార్య, పిల్లలకు వెరసి రూ.46.78 లక్షలు మూర్తి తల్లిదండ్రులు ఆదుర్తి గోపాలరావు, సూర్యావతి, భార్య విజయలక్ష్మి, పిల్లలు చందన, హెమాన్షిలకు అందించారు. కార్యక్రమంలో డీఎస్పి పి.విశ్వనాథ్, ఏలూరు రేంజ్ అసోసియేషన్ అధ్యక్షుడు మోజేష్, పామర్రు ఎస్ఐ ఎస్.కె జానీబాషా, పోలీసు మిత్రులు శ్రీహరి, రమేష్, దుర్గారావు, శంకరు, విజయ్, వెంకట రమణ, గురవయ్య, వాసు, బుచ్చిబాబు పాల్గొన్నారు.

పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీలు

ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలు, మరో ముగ్గురి అరెస్టు.. పావుకిలో బంగారం, 13 కేజీల వెండి స్వాధీనం



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కరుడుగట్టిన అంతర్ రాష్ట్ర దొంగలు ఇద్దరిని అరెస్టు చేశామని వారితో పాటు వారు తీసుకువచ్చిన దొంగ సొత్తును తాకట్టులో పెట్టి సొమ్ములను వాటాలు వేసుకుంటున్న మరో ముగ్గురిని కూడా అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఇటీవల ఏలూరు పరిసర ప్రాంతాల్లో పలు దొంగతనాలు జరిగాయి. దీంతో నేరాలు జరిగిన ఆధారాలను బట్టి పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఏలూరు హనుమాన్‌నగర్ బ్రిడ్జి వద్ద అంతర్ రాష్ట్ర దొంగలైన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన వెంపటి చంటి, కోసూరి శ్రీనివాసరావును అరెస్టు చేశారు. వారిచ్చిన సమాచారంతో కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో ఉన్న భీమవరానికి చెందిన సాకా మర్రాజు అలియాస్ ప్రకాష్, పోతుల అమ్మిరాజు, గోగులమండ సాల్మన్ రాజులను అరెస్టు చేశారు. వీరందరి వద్ద నుంచి 251 గ్రాముల బంగారు ఆభరణాలు, 13 కేజీల వెండి వస్తువులు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు రూ.23 లక్షలు ఉంటుందని ఎస్పీ చెప్పారు. వెంపటి చంటిపై ఆంధ్రలో 105 కేసులు, తెలంగాణాలో ఆరు కేసులు, కోసూరి శ్రీనివాసరావుపై ఆంధ్రా తెలంగాణాలో 20 కేసులు ఉన్నాయని చెప్పారు. వీరిద్దరు కలిసి మోటారు సైకిల్‌పై పగటివేళ వివిధ ప్రాంతాలు తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తారు. రాత్రి వేళ ఇనుపరాడ్డుతో తాళాలు పగులగొట్టి చోరీ చేసిన సొత్తును సాకామర్రాజు, పోతుల అమ్మిరాజు, గోగులమండల సాల్మన్‌రాజులకు అందిస్తారు. ఆ ముగ్గురు విక్రయించిన తరువాత వీటిని వాటాలు వేసుకుంటారు. మొత్తం 16 కేసుల్లో చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్పీ వివరించారు. వీరిని అరెస్టు చేయడంలో అత్యంత ప్రతిభ కనబర్చిన ఏలూరు త్రి టౌన్ ఇన్‌స్పెక్టర్ వి.కోటేశ్వరరావు, కైకలూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సీసీఎస్‌సీఐ రాజశేఖర్, ఎస్ఐలు వెంకట కుమార్, శ్రీనివాస ప్రసాద్, ఏఎస్ఐలు పూర్ణచంద్రరావు, రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఓం ప్రకాష్‌లను ఎస్పీ అభినందించారు. ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్ర రావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యో పాపం ఎంత కష్టం

- ఏడు పదుల వయసు దాటిన వృద్ధ దంపతులు
- పురుగు మందు తాగేశారు.. వృద్ధురాలి మృతి.... కొట్టుమిట్టాడుతున్న భర్త





మల్లేశ్వరి మృతదేహం.. చికిత్సపొందుతున్న జగ్గారావు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధ దంపతులు ఆత్మహత్యాయత్నం చేశారు. వీరిలో భార్య మృతి చెందగా, భర్త కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏలూరు రూరల్ మండలం సుంకరవారి తోటకు చెందిన కోట్ని జగ్గారావు (75) గతంలో వ్యవసాయం చేస్తూ పాల వ్యాపారం కూడా చేశారు. ఆయనకు భార్య దుర్గా మల్లేశ్వరి (73) ఉన్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉండగా పెద్ద కుమారుడు రవి బాబుకు వివాహం అయింది. అతనికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవిబాబు భార్య మరణించింది. చిన్న కుమారుడు అయిన సతీష్‌కు వివాహం కాలేదు. కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో మల్లేశ్వరి తన కిడ్నీని కుమారుడికి ఇచ్చింది. ఐదేళ్ళపాటు ఆరోగ్యంగానే జీవించాడు. నాలుగేళ్ళ క్రితం మరణించాడు. వారి ఇద్దరు కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. పెద్ద కుమారుడు అయిన రవిబాబు కుంభమేళకు ప్రయోగరాజ్‌కు వెళ్ళారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో ఉన్నారు. ఆ వృద్ధ దంపతులు ఏమి ఆలోచించుకున్నారో ఏమో కాని తమ కుమారుడికి భారం కాకూడదని నిర్ణయించుకున్నారో, ఈ జీవితాన్ని కొనసాగించలేమని భావించారో తెలియదు కాని సోమవారం సాయంత్రం ఇంట్లో ఇద్దరు పురుగుమందుతాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ఆ ఇంటి పనిమనిషి వచ్చి గమనించి ఏలూరులో ఉంటున్న ఆ వృద్ధ దంపతుల అల్లుడికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారు వచ్చి ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి దుర్గా మల్లేశ్వరి మరణించింది. జగ్గారావు కూడా ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ ఎం.జీవరత్నం హుటాహుటిన ఆసుపత్రికి వెళ్ళి పరిశీలించారు. మరోవైపు అతని కుమారుడికి సమాచారం ఇచ్చారు. వృద్ధురాలి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయితో ఐదుగురి అరెస్టు

13.2 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న డీఎస్పీ

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి 13.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ డి.విశ్వనాథ్ విలేకరులకు వెల్లడిం చారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రుకు చెందిన నల్లి శ్రీని వాస్, కరాటం బాలకృష్ణ, నల్లజర్ల మండలం తెలికిచర్లకు చెందిన కంకిపాటి నాగ రాజు, గుండుగోలు మురళి, తాడేపల్లి గూడెంకు చెందిన ముసునూరి దుర్గా ప్రసాద్‌లను ముందస్తు సమాచారం మేరకు రైల్వేగూడ్స్ షెడ్ వద్ద గంజాయి తరలిస్తుండగా పోలీసులు దాడిచేసి గంజాయితోపాటు పట్టుకు న్నారు. వారితోపాటు తాడేపల్లిగూడెంకు చెందిన కమ్మ అరవింద్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్న వారిని అరెస్టు చేసిన సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సైలు నాగరాజు, బాలం శ్రీను, సిబ్బందిని డీఎస్పీ విశ్వనాథ్ ప్రత్యేకంగా అభినందించారు.


కైకరంలోని వేణుగోపాల స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కైకరంలో ఘనంగా వేణుగోపాల స్వామి కల్యాణం

ఉంగుటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మాఘ మాసంలో జరిగే కళ్యాణోత్సవంలో భాగంగా సోమవారం ఉంగుటూరు మండలం కైకరంలో ఉన్న రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ట్రస్టీ యెగ్గిన శేషయ్య దొర, పెదబాబు దంపతులు ఈ కళ్యాణోత్సవంలో పీటల పై కూర్చున్నారు. అనంతరం ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు.

పదవ తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రీ పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రశ్నా పత్రాలను ఏరోజుకారోజు పరీక్ష ప్రారంభయ్యే సమయానికి ఒక గంట ముందు స్థానిక మండల ఎంఆర్‌సీ కార్యాలయం నుంచి ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్టు డీఈవో కార్యాలయ వర్గాలు వివరించాయి. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 14,633 మంది ఉండగా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో కలిపితే మొత్తం 24,054 మంది ఉన్నారు.

'ఉపాధి కార్మికులకు పనులు కల్పించాలి'

టి.నరసాపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులకు పని కల్పించాలని బొర్రంపాలెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ సోమవారం డిమాండ్ చేశారు. ప్రతి ఏటా ఫిబ్రవరి నాటికల్లా ఉపాధి పనులు ముమ్మరంగా జరిగేవని, అయితే అధికారుల అలసత్వంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పనులు జరుగుతున్నాయని, కానీ బొర్రంపాలెంలో పనులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు.

రాష్ట్ర అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు 3,707 కోట్ల ఖర్చు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లలో రాష్ట్రానికి 3,707 కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసినట్టు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. పార్లమెంట్‌లో ఎంపీ మహేష్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానమిచ్చారు. 2018-19 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో సీఎస్ఆర్ నిధులు 3,707 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. 25 విభాగాలకు ఈ నిధులు కేటాయించినవాటిలో విద్యా రంగానికి 734కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.1050 కోట్లు, జీవనో పాధి మెరుగుదలకు 238 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.706 కోట్లు కేంద్రం ఖర్చు చేసిందన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఏలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలకు జీతాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని అఖిల భారత అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ ఫెడరేషన్ సోమవారం పోలవరం పంచాయతీ జగన్నాథపేట అంగన్వాడీ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి వినతి పత్రాలు పంపనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు, హెల్పర్లు వినతి పత్రాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు హెల్పర్లు పాల్గొన్నారు.


షోరూంను ప్రారంభిస్తున్న కర్పూరం కేశవరావు, తదితరులు

ఘనంగా సత్యా ఏజెన్సీస్ 45వ షోరూం ప్రారంభం

ఏలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద సత్యా ఏజెన్సీస్ 45 వ షోరూంను ఘనంగా ప్రారంభించినట్టు సత్య ఏజెన్సీస్ ఏపీ హెడ్ సెంథిల్ తెలిపారు. భవన యజమాని కర్పూరం కేశవరావు షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ బ్రాండ్ కంపెనీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బడేటి చంటి పుట్టిన రోజు వేడుకలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మారం హనుమంత రావు తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, నగదు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ఫ్లాష్ టీమ్, వాకర్స్ అసోసియేషన్ వివిధ వ్యాపార సంఘాల నాయకులంతా కలిసి నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని నాయకులు శ్రీనివాస్ తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతా నియమాలపై అవగాహన పెంచుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం డిపాల్ స్కూల్లో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, సీట్‌బెల్ట్ ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు జగదీష్, అజ్మీరా బద్దు, కల్యాణి, నరేంద్రబాబు పాల్గొన్నారు.

నేడు యునాని ప్రత్యేక వైద్య శిబిరం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యునాని దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆరణలోని యునాని వైద్యశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.రఘునాథ్ మాట్లాడుతూ వైద్య శిబిరాన్ని ఆయుష్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు కె.కల్పనా కటాక్షం ప్రారంభిస్తారని అన్నారు. ప్రజలంతా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండుగొలను, భీమడోలు పాఠశాలల పరిశీలన

భీమడోలు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండుగొలను, భీమడోలులోని జడ్పీ హైస్కూళ్లను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ మధ్యాహ్న భోజన పథకంలోని వంటకాలను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న విద్యాబోధనపై ఆరా తీశారు. అనంతరం భీమడోలు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు నులిపు రుగుల నివారణ మాత్రలను ఎంపీడీవో సి.హెచ్.పద్మావతి, ఎంఈవో భాస్కర్ కుమార్ పంపిణీ చేశారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పరీక్ష పే చర్చ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రక్తహీనత నివారణకు ప్రభుత్వం చర్యలు

ఐటీడీఏ పీవో రాములు నాయక్

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : పిల్లలలో రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని దీనిలో భాగంగా కెఆర్ పురం ఐటీడీఏ పివో, ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురష్కరించుకుని సోమవారం రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని పిల్లల చేత నులిపురుగుల నివారణ మాత్రలను మింగించారు. మందు బిళ్ళలను ఎలా మ్రింగాలో స్వయంగా పివో టాబ్లెట్ వేసుకుని పిల్లలచేత మ్రింగించడం చేశారు. చాలామంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారని, నులుపురుగుల కారణంగానే రక్తహీనత కలుగుతుందన్నారు. రక్తహీనత వలన పిల్లల్లో పెరుగుదల నిలిచిపోతుందని, తీవ్రమైన అనారోగ్యానికి గురై ప్రాణపాయ పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు. కెఆర్ పురం ఐటిడిఎ పరిధిలోని పాఠశాలలు, గురుకులాలు, వసతిగృహాల్లో 38 వేల మంది పిల్లలు ఉన్నారని 450 టీమ్‌లు పిల్లలకు నులిపురుగుల మందులను అందించనున్నట్టు డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టరు జె.సురేష్ కుమార్ తెలిపారు.

ట్రాఫిక్ సమస్య జఠిలం

ప్రధాన రోడ్లపై ఫుట్‌పాత్‌ల ఆక్రమణ - చూసీచూడనట్టు వదిలేస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్య అంతకంతకూ పెరుగుతోంది. గతంలో నగరంలో ట్రాఫిక్ పోలీసులు ఎంతో సమర్థవంతంగా పనిచేసేవారు. నగరంలో ఉన్న ట్రాఫిక్ నిబంధనలు అమలు చేశారు. ముఖ్యంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ భారీ వాహనాలు, ట్రాక్టర్లు నిషేధం, కానీ ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు నగరంలో ఉన్నారా అనే ప్రశ్న తలెత్తుతోంది. నగరంలో భారీ వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. గతంలో భారీ వాహనాలను నిషేధిత సమయంలో అనుమతిచ్చేవారు కాదు. రాత్రి వేళ ప్రైవేటు బస్సులను కూడా మినీ బైపాస్ రోడ్డులో మినహా కొత్త బస్టాండ్ వైపు వెళ్ళనిచ్చేవారు కాదు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదుల మేరకు అధికారులు కఠిన నిర్ణయాలు తీసు


ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం

కున్నారు. రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం మాకెందుకులే అని చూస్తూ మిన్నకుండిపోవడంలో అంతర్యం ఏమిటో అధికారులే తేల్చాల్సి ఉంది. ఏలూరు ప్రభుత్వాస్పత్రికి నిత్యం వందలాది మంది వస్తుంటారు. ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఆర్ఆర్‌పేట రోడ్డులో విద్యా సంస్థలు ఉన్నాయి. ఆ రోడ్డులో వేలాది మంది విద్యార్థులు నడుచుకుంటూ కాలేజీలకు, స్కూళ్ళకు వెళ్తుంటారు. ఆసుపత్రి, సెయింట్ థెరిస్సా హైస్కూల్ సమీపంలో ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమిస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతున్నా సంబంధిత అధికారులు తనిఖీ చేసిన ఆనవాళ్ళే కనిపించడం లేదు.

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు...

గతంలో పనిచేసిన అధికారులు నిత్యం రోడ్డుపైన ఏదో ఒక ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించడమో, ట్రాఫిక్ నియంత్రణ చేస్తూ ప్రజలకు సేవలు అందించేవారు. ఇప్పుడు ఆ దాఖలాలు కనిపించడం లేదు. మార్చిలో 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఇదే విధంగా రోడ్ల ఆక్రమణలు కొనసాగిస్తే ట్రాఫిక్ సమస్యలు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణం ఏలూరు ట్రాఫిక్‌ను ప్రక్షాళన చేసి ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని కోరుకుంటున్నారు.

సచివాలయానికి సిబ్బంది డుమ్మా

జాలిపూడి సచివాలయం ఆకస్మిక తనిఖీ
సిబ్బంది తీరుపై ఎంపీడీవో శ్రీలత ఆగ్రహం
బాధ్యులకు నోటీసులు అందజేత

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం, జాలిపూడి సచివాలయంలో సిబ్బంది పనితీరు నానాటికి తీసికట్టుగా మారుతోంది. సేవలు అటుంచితే అసలు ఉద్యోగులు విధులకు హాజరు కావడమే గగనంగా కనిపిస్తోంది. సమయ పాలన అసలు పాటించడం లేదు. పలు పనులు కోసం వచ్చిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. సోమవారం ఏలూరు ఎంపీడీవో వెన్నా శ్రీలత చాటపర్రు పీహెచ్‌సీ, జాలిపూడి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం 11 మంది సిబ్బందికి ఇద్దరే ఉండటంతో ఆశ్చర్యపోయారు. వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా సంరక్షణ అధికారిణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఇతర సిబ్బంది సైతం కనీసం అటెండెన్స్ కూడా వేయకుండా విధులకు


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీలత

డుమ్మా కొట్టినట్లు గుర్తించారు. అక్కడే ఉన్న సిబ్బందిని మిగిలిన సిబ్బంది ఎక్కడికి వెళ్ళారని ప్రశ్నించగా, సమాధానం లేదు. కొంతమంది సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు కూడా చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులకు షోకాజు నోటీసులు జారీ చేస్తామని, సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల కేంద్రంలో ఇలా ఉంటే మిగతా గ్రామాల సచివాలయాల పరిస్థితి ఏమిటో అని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

విద్యార్థులంతా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

వైద్యాధికారుల సూచనలు

లింగపాలెం/ చింతలపూడి/ టి.నరసాపురం/ పెదవేగి/ ఏలూరు రూరల్/ కామవరపుకోట/ కొయ్యలగూడెం/ నిడమర్రు/ పెదపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు బాలబాలికలంతా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని పలువురు వైద్యాధికారులు పేర్కొన్నారు. ఆయా మండలాల అధికారుల ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. లింగపాలెం మండలంలో అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్‌లు, కళాశాలల్లో చిన్నారులకు, విద్యార్థులకు నులిపురుగుల నివారణకు డాక్టర్ కృష్ణ కిశోర్ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ కిశోర్ మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా చిన్నారుల్లో శారీరక ఎదుగుదల, రక్తహీనత, ఆకలి మందగించడం వంటి సమస్యలు వస్తాయన్నారు. టి.నరసాపురం మండల వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ ఆధ్వర్యంలో పాఠశాలల్లో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోజ్ మేరీ మాట్లాడుతూ పెదవేగిలో 16,228 మంది చిన్నారులు ఉన్నారని, తొలిరోజు సోమవారం 15,864 మంది చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను మింగించామని ఆమె తెలిపారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఎంపీడీవో


లింగపాలెంలో మాత్రలు వేస్తున్న వైద్యాధికారి కృష్ణ కిశోర్

వెన్నా శ్రీలత ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కామవరపుకోట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలను ఏఎన్ఎం విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో అందజేశారు. కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం పీహెచ్‌సీ డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంవీఆర్ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.గీతారాణి, ఆరోగ్య విస్తరణాధికారి సుబ్రహ్మణ్యం, చాన్‌బాషా, సుబ్బారావు పాల్గొన్నారు. నిడమర్రు మండలం భువ్వనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈవో శ్రీనివాసు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంకు ఏసుబాబు, నగిరెడ్డి వెంకట సుబ్బారావు, ఏ.ఆర్.కె. కుమార్ పాల్గొన్నారు. పెదపాడు జడ్పీ హైస్కూల్లో నులిపురుగుల నివారణ మాత్రలను డీపీఎంవో చక్రధర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆమీలు జమ, డాక్టరు అనంతపాల్, హెచ్.ఎం. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరులో ఉత్సాహంగా నామినేషన్ల పర్వం


కేంద్ర మంత్రి వర్మకు స్వాగతం పలికిన నాయకులు

భీమడోలు /లింగపాలెం/చింతలపూడి / జంగారెడ్డి గూడెం / కామవరపుకోట / కొయ్యలగూడెం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి కార్యకర్తలు నాయకులు ఏలూరు భారీగా తరలివచ్చారు. భీమడోలు మండలం గుండుగొలను జంక్షన్‌లో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల నుంచి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్య కర్తలు గుండుగొలను చేరుకుని అక్కడి నుంచి భారీ ర్యాలీగా ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. లింగ పాలెం మండలం నుంచి టీడీపీ మండల అధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. చింతలపూడి నుంచి ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు ఏలూరు తరలివచ్చారు. జంగారెడ్డి గూడెం పట్టణ టిడిపి అధ్యక్షుడు రావూరి కృష్ణ అధ్యక్షతన కూటమి నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కామవరపుకోట మండలం నుంచి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు తరలివచ్చారు. కొయ్యలగూడెం మండలం నుంచి మాజీ ఏఎంసీ ఛైర్మన్ పారేపల్లి రామారావు ఆధ్వర్యంలో నాయకులు తరలివచ్చారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించగా భీమడోలు మండలం గుండుగొలను జంక్షన్ నుంచి నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు. పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తరలి రావడంతో సి.ఆర్.రెడ్డి కళాశాల వద్ద బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం విజయానికి అంతా కృషి చేయాలని జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ కోరారు. నామినేషన్ అనంతరం జడ్పీ క్యాంపు కార్యాలయంలో రాజశేఖరంను పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా సంగీత విభావరి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మహా గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాక్షేత్రం నిర్వాహకులు బుద్దా రామారావు అన్నారు. అమర గాయకుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని ఏలూరులో ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో సోమవారం వైఎంహెచ్ఏ ప్రాగణంలో సంగీత విభావరి నిర్వహించారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘంటసాల చివరిగా పాడిన భగవద్గీత శ్లోకాలను ప్రతి ఒక్కరూ వింటున్నారని అన్నారు. అనంతరం ఘంటసాల సంగీత కళాశాల అధ్య


గీతాలను ఆలపిస్తున్న కళాకారుల బృందం

క్షులు రేవతి, రాంకుమార్, మనస్విని, ఇతర గాయకులు ఘంటసాల ఆలపించిన సినీ గీతాలను ఆలపించి అలరించారు. కార్యక్రమంలో నాట్యాచార్య కె.వి.సత్యనారాయణ, జి.మోహన్ విఠల్ పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి : జేసీ

దెందులూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు అన్ని రకాల పంటలను ఈక్రాప్‌లో నమోదు చేయించుకోవాలని జేసీ పి.ధాత్రిరెడ్డి సూచించారు. పంటల నమోదు వల్ల ప్రభుత్వ పథకాలతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. సోమవారం మండలంలోని సత్యనారాయణపురంలో అపరాలు, పోతునూరులో మొక్కజొన్న పంటలను వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా,ఏడీ సుబ్బారావులతో కలిసి జేసీ పరిశీలించారు. జేసీ వెంట


సత్యనారాయణపురంలో పంట పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

దెందులూరు తహసీల్దార్, అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజార్టీతో గెలిపించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కోరారు. మండలంలోని పంగిడిగూడెంలో ఆయన కూటమి నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు లంకా సత్యన్నారాయణ, పోలిన శ్రీను, చింతమనేని హనుమంతరావు, డివి చౌదరి, ఏపూరి దాలయ్య, కాలి అశోక్ పాల్గొన్నారు.

జల్లేరు బ్రిడ్జి పనులు చేపట్టాలి

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలంలోని పట్టెన్నపాలెంలోని జల్లేరు వాగు బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. సోమవారం పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద ఆందోళనలు చేపట్టారు. మధ్యలో నిలిచిపోయిన బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలని నినాదాలు చేశారు.ఈ ప్రభుత్వంలోనైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోడే సూర్యచంద్రం, సత్యనారాయణ, సంకురు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై వర్క్‌షాపు

పెదపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం, విశాఖపట్నానికి చెందిన ఎం.ఎస్.ఎం.ఈ. సెంటర్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలు, నైపుణ్యాలు అనే అంశంపై ఐదు రోజుల వర్క్ షాపు సోమవారం ప్రారంభమైంది. ఎం.ఎస్.ఎం.ఈ. సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టరు మురళీకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థి క్లాస్‌రూం లెర్నింగ్‌తో పాటుగా వివిధ పరిశ్రమలను సందర్శించి అక్కడ నిర్వాహకుల దగ్గర మరింత నైపుణ్యాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు కేవీ శ్రీధర్, కోఆర్డినేటర్స్ సతీష్, మోహన్ విఠల్ పాల్గొన్నారు.

ఉపాధి మేట్ల నియామకంపై రగడ

టి.నరసాపురం, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి) : టి.నరసాపురంలో ఇటీవల ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల నియామకం కోసం కూటమి నాయకుల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. దీకితోడు ప్రస్తుతం ఉపాధి పనులు చేయించే మేట్‌ల ఏర్పాటు, కూలీల నమోదు ప్రక్రియలో రగడ మొదలైంది. ఫీల్డ్ అసిస్టెంట్ల ప్రమేయం లేకుండానే మేట్‌లు కూలీల పనులు నమోదు చేయడం ఎమిటని పలువురు నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఏపీవో వివరణ కోరగా మేట్‌లు తీసుకొచ్చిన కూలీల పేర్లు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం దత్తత ఆలయమైన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయం వద్ద జరుగుతున్న కళ్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని తూర్పువీధిలోని స్వామి, అమ్మవార్లకు శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య ఈ ఉత్సవం జరిగింది. ఆలయ ప్రాంగణంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు, ఎదుర్కోలు ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి ఏడున్నరకు ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం విజయ రాఘవాచార్యులు, ఆలయ ఇన్‌చార్జి గోపీలు తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్త, అత్తపై కేసు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : తల్లితో కలిసి భార్యను వేధిస్తున్న కేసులో భర్తపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై మంగయ్య తెలిపారు. మండలంలోని చల్లావారిగూడెం గ్రామానికి చెందిన రత్నమౌళికకు, కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన డి.జ్ఞానేశ్వరరావుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త మద్యానికి బానిసయ్యి భార్యను చిత్ర హింసలకు గురి చేస్తుండగా తల్లి విజయలక్ష్మి సహకరిస్తోందని తెలిపారు. ఐదు నెలల క్రితం ఆమెను కొట్టి పుట్టింటికి పంపడంతో ఆమె అక్కడే ఉంటోంది. అత్తగారింటికి వెళ్లడానికి ప్రయత్నం చేస్తే ఇద్దరు పిల్లలను చంపేస్తానని బెదిరింపులకు గురి చేశాడని ఫిర్యాదు అందిందని ఏఎస్ఐ తెలిపారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై తెలిపారు.

కాకర్లమూడి సర్పంచ్ మృతి



ఉంగుటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం కాకర్లమూడి గ్రామ సర్పంచ్ కాళ్ల నాగ వెంకట సత్యనారాయణ(48) అనారోగ్యంతో ఆది వారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ధర్మరాజు, మండల టి.డి.పి. అధ్యక్షులు పాతూరి విజయ కుమార్,కడియాల రవి శంకర్ తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

13 నుంచి పీసా శిక్షణ తరగతులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లో ఎన్నికైన పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి తెలిపారు. 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది మహిళా సమాఖ్య లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు హాజరు కావాలన్నారు. సమావేశంలో ఏజెన్సీల్లో పీసా కమిటీ ద్వారా పంచాయతీ అభివృద్ధి, పీసా నియమాలు వివరిస్తారని స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ఇంటర్వ్యూ..

14 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



ఉషారాణి, మండల వ్యవసాయాధికారిణి, భీమడోలు

• మండలంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాలు ఎన్ని?

జవాబు : భీమడోలు మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం.

• మండలంలో రైతు సేవా కేంద్రాల పనితీరు ఎలా ఉంది?

జవాబు : రైతులకు సేవా కేంద్రాలు అందుబాటులో ఉంచాం. ఈ క్రాప్, పంట నమోదు ప్రక్రియ జరుగుతోంది. దీని ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు తోడ్పడుతుంది. అలాగే రైతు సేవా కేంద్రాల్లో ప్రస్తుతం రైతుల గుర్తింపు కార్యక్రమాలు వివరాలను సేకరిస్తున్నాం. ప్రభుత్వ పథకాల అమలుకు ఇది సహకరిస్తుంది.

● మండలంలో సాగవుతున్న పంటల వివరాలు ?

జవాబు : వరితో పాటు దాళ్వాలో మొక్కజొన్న, ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలు సాగవుతున్నాయి.

● రైతులకు భీమా పథకాలేమిటి?

జవాబు : వరి రైతులకు ఎకరానికి 500 రూపాయలు, మొక్క జొన్న రైతులకు 420 రూపాయలు, మినుములు, పెసలు వంటి అపరాల రైతులకు ఎకరానికి 60 రూపాయల చొప్పున భీమా చెల్లించుకోవచ్చు.

\- భీమడోలు

సాంబశివ రెడ్డికి నివాళి

చింతలపూడి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం యర్రగుంటపల్లి మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకులు తాళ్లూరి సాంబశివ రెడ్డి సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. సోమవారం యర్రగుంటపల్లిలో జరిగిన సాంబశివరెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, మాజీ జడ్పీటీసీ టి.రాధారాణి, టి.చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు మన్యం బంద్

పోలవరం/బుట్టాయగూడెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి 11, 12 తేదీల్లో ఏపీ రైతు కూలీ సంఘం, ఏజన్సీ గిరిజన సంఘం చేస్తున్న 48 గంటల మన్యం బందు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏజన్సీ గిరిజన సంఘం అధ్యక్షులు ఇల్లా రామిరెడ్డి, కార్యదర్శి కుంజం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ హక్కులపై పాలకుల దాడిని ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని అన్నారు. మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సోమవారం ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాల నాయకులు మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహించారు.

సీపీఎం సంపూర్ణ మద్దతు..

ఏలూరు కార్పొరేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 11, 12 తేదీల్లో జరుగుతున్న ఏజెన్సీ బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పి.రామకృష్ణలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనుల హక్కులను పరిరక్షించాలని కోరుతూ రెండ్రోజుల పాటు ఏజెన్సీ మండలాల్లో జరిగే బంద్‌కు సీపీఎం మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

టెక్ ఫెస్ట్ పోస్టర్ విడుదల

పెదపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే టెక్ ఫెస్ట్ 2025 కు సంబంధించి పోస్టర్‌ను కళాశాలలో సోమవారం ప్రారంభించారు. సివిల్, ఇ.ఇ.ఇ., ఇ.సి.ఇ., మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 29న టెక్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు డాక్టరు తేజోమూర్తి, డాక్టరు శ్రీనివాసరెడ్డి, డాక్టరు రాంబాబు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారు

అచ్చమ్మకు ప్రత్యేక అలంకారం

దెందులూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : గాలాయగూడెం గ్రామ దేవత శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ 68వ వార్షికోత్సవం ఏడవ రోజు ఘనంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకులు తిప్పాభట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో పుట్టింటి పట్టుచీరతో ప్రత్యేకంగా అలంకరించారు. అచ్చమ్మ పేరంటాలమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గ్రామానికి చెందిన మణికంఠ కనస్ట్రక్షన్ అధినేత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు.

విద్యుదాఘాతానికి మహిళ మృతి


సుధ మృతదేహం

మండవల్లి ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుదా ఘాతానికి మహిళ మృతి చెందింది. మండవల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పుట్టచెరువు గ్రామానికి చెందిన పమిడి సుధ(34) తన భర్త విశ్వేశ్వరతో కలిసి గ్రామంలోని కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. గ్రామంలోని రక్షిత మంచి నీటి పథకం ద్వారా ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటలకు కుళాయిల ద్వారా నీటిని అందిస్తారు. ఈ నేపథ్యంలో కూలి పనికి వెళ్లి వచ్చిన సుధా మోటార్‌ను వేసేందుకు వెళ్లగా ఇంట్లో మోటార్ వైర్‌ను పశువులు లాగేయడంతో గడ్డిలో ఉన్న కరెంటువైర్ చూసుకోకుండా పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మరణించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

స్టెమి వైద్యసేవలతో గుండెపోటు నుంచి రక్షణ

కైకలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్టెమి వైద్యసేవలతో గుండెపోటు నుంచి మనిషిని కాపాడుకోవచ్చని కైకలూరు సీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.శ్వేత అన్నారు. సోమవారం కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో గుండెపోటు మరణాలకు స్వస్తి చెప్పేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్టెమి గుండెపోటుకు భరోసా పోస్టర్లను ఆవిష్కరించారు. సిబ్బందికి గుండెపోటు మరణాలపై అవగాహన కల్పించారు. గైనకాలజిస్ట్ బాలప్రసూనదేవి, సిబ్బంది పాల్గొన్నారు.


ముదినేపల్లి మండలం పెదగొన్నూరు హైస్కూల్లో పీఎం పరీక్షా పే కార్యక్రమం

ప్రధాని పరీక్ష పే చర్చను తిలకించిన విద్యార్థులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పరీక్షా పే చర్చ -2025 కార్యక్రమాన్ని సోమవారం ముదినేపల్లి మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ 9,10 తరగతుల విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ప్రధాని తన ప్రసంగంలో పేర్కొన్న అంశాలను శ్రద్ధగా విన్నారు. ఈ చర్చా కార్యక్రమంలో 21 అంశాలపై ప్రధాన మంత్రి ప్రసంగించారు. పరీక్షలను భారంగా చూడవద్దని, మీతో మీరే పోటీ పడండి, ఇతరులతో పోల్చుకోవడం మానేయండి, నిజమైన లక్ష్యాలను పెట్టుకోండి, అమ్మ, నాన్న, గురువులతో చర్చించండి కొత్త విషయాలు తెలుస్తాయి, రాయడం ప్రాక్టీస్ చేయండి అంటూ పలు అంశాలను వివరించారు.


విద్యార్థిని పల్లవిని అభినందిస్తున్న ఎంఈవో రామారావు

ఆన్‌లైన్ పరీక్షల్లో విద్యార్థిని ప్రతిభ

కైకలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఈఈఎంటి-2025 ఆన్‌లైన్ ప్రతిభా పరీక్షల్లో జంగంపాడు విద్యార్థినీ జిల్లా ప్రథమ స్థానాన్ని పొందడం అభినందనీయమని ఎంఈవో డి.రామారావు అన్నారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన ఆన్‌లైన్ ప్రతిభా పరీక్షల్లో కైకలూరు మండలం జంగంపాడు పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థినీ పొన్నాల పల్లవి ప్రథమస్థానం సాధించడం పట్ల పాఠశాలలో సోమవారం ఘనంగా సత్కరించారు.

క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండండి : జేడీ రమేష్


టీబీ వ్యాధి బాధితులతో మాట్లాడుతున్న డైరెక్టర్ రమేష్

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్య ఆరోగ్యశాఖ టీబీ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. నూజివీడు మండలం గొల్లపల్లి పీహెచ్‌సీని ఆయన సోమవారం సందర్శించారు. క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏ విధమైన లక్షణాలు ఉన్నా వెంటనే దగ్గర్లోని ఆరోగ్య సిబ్బందిని సంప్రదిం చాలన్నారు. వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాలపై డాక్టర్ ఎం.నాగేశ్వరరావు వివరించారు. నూజివీడు టీబీ క్లినిక్ వైద్య అధికారి ఏ.దుర్గాభవానీ, గొల్లపల్లి వైద్య అధికారి శ్రీనివాస్‌గౌతమ్, సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

చెక్కపల్లిలో సారా తయారీ కేంద్రాలపై దాడి


బెల్లం ఊటను పారబోస్తున్న సిబ్బంది

ముసునూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లిలో నూజివీడు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు సోమవారం చేసిన దాడుల్లో సారా తాయారు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో గ్రామశివారు పామాయిల్ తోటలో సారా తాయారు చేస్తున్న తాళం రాజును అదుపులోకి తీసుకుని, 400 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. రాజును అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ భోగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

16 ఏళ్లలో.. 20 పాఠశాలల మూత



వి.రావిగుంటలో మూతబడిన యూపీ స్కూల్

» మండలంలో ఎయిడెడ్ నిల్
» మూతబడే దశలో మరో పది పాఠశాలలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత 16 ఏళ్లలో 20 మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ, ప్రాథమిక పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు పూర్తిగా మూతపడగా, ఆరు యుపీ పాఠశాలలు ఎలిమెంటరీ పాఠశాలల స్థాయికి పడిపోయాయి. మండలంలో 10 ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలు, 2 యుపీ పాఠశాలలు, 8 ఎలిమెంటరీ పాఠశాలలు విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి మూతబడ్డాయి. పెనుమల్లి, వి.రావిగుంట యుపీ పాఠశాలలు, రెడ్డిపూడి, నాయుడు చెరువు, గంగాపురం, చినకోమర్రు, స్తంభం చెరువు, ఈడేపల్లి, సూర్యనారాయ ణపురం ఎలిమెంటరీ పాఠశాలలు మూతబడటంతో ఆయా గ్రామాల విద్యార్థులకు ప్రాథమిక విద్య దూరమవు తుంది. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో వూటుకూరు, ప్రొద్దువాక, ములకలపల్లి, పేరూరు, కోమర్రు, దేవరం యూపీ పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలుగా మారాయి. సంకర్షణపురం, పెదపాలపర్రు, చిన్నపత్తిపాడు, కోడూరు, పెయ్యేరు, చిగురుకోట, చేవూరు, విశ్వనాద్రిపాలెం, ప్రొద్దువాక, గురజ ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో వందలాది మంది విద్యార్థులు పక్క గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఎక్కువ సంఖ్యలో చేర్పించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు కల్పించినా తల్లిదండ్రులు అధిక శాతం ప్రైవేట్ విద్యాసంస్థల వైపే మొగ్గు చూపడంతో ఈ పరిస్థితి నెలకొందని చెప్పవచ్చు.

• మండలంలో ప్రస్తుతం ఒక్క ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాల లేదు. మొత్తం పది పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో ఎస్సీ, బీసీ వర్గాల విద్యార్థులకు ప్రాథమిక విద్య అందుబాటులో లేకుండాపోయింది. ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ లేక ఆ పాఠశాలలను యాజమాన్యాలు నిర్వహించ లేకపోయాయి.

• పది మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలను మూసేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే మండలంలో మరో 10 ఎలిమెంటరీ పాఠశాలలు మూతపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మండలం లోని 67 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 4,500 మంది విద్యార్థులు చదువుతుండగా, ఏడు ప్రైవేట్ పాఠశాలల్లో ఐదు వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు.


కర్షక దళిత వాడలో 15 ఏళ్ల క్రితం మూతబడి శిథిలమైన పాఠశాల భవనం

ముదినేపల్లి కాపు సంక్షేమ సంఘు కార్యవర్గం


గోపాలకృష్ణ

ముదినేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ కాపు సంఘం ముదినేపల్లి మండల శాఖకు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ శాఖ అధ్యక్షుడిగా పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా సూదాబత్తుల వెంకట రమణ, వడ్లాని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా అల్లాడి సతీష్, అబ్బిశెట్టి నరేష్, కోశాధికారిగా దాసరి ఉమామహేశ్వరరావు నియమితులయ్యారు. వీరికి సంఘ కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులుగా బెల్లంకొండ వెంకన్నబాబు సోమవారం నియామక పత్రాలు అందజేశారు.

నేడు బలివేపై సమావేశం

ముసునూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలివే రామలింగేశ్వర స్వామి మహా శివరాత్రి కళ్యాణ మహోత్సవాల ఏర్పా ట్లుపై నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధ్యతన మంగళవారం మధ్యాహ్నం 3 గంట లకు ఆలయ ప్రాంగణం వివిధ శాఖల అధి కారులతో సమన్వయ సమావేశం జరుగుతుం దని ఈవో పామర్తి సీతారామయ్య తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఈవో కోరారు.


ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు ఐక్యత చాటుతున్న ఎమ్మెల్యేలు కామినేని, బొమ్మిడి నాయకర్, తదితరులు

'అభివృద్ధిని కాంక్షించే ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి'

కైకలూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు వెళతుందని ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ కాపాడుకోవాల్సిన అవసరం పట్టభద్రులపై ఉందని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం కైకలూరు సీఎన్నార్‌గార్డెన్‌లో పటభద్రులతో, కూటమి నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ విధ్వంసాల నుంచి రాష్ట్రాన్ని ఇప్పుడే గట్టెక్కిస్తున్నామని విద్యావంతులంతా ఆలోచన చేసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వీరంకి గురుమూర్తి, మెంటే పార్థసారథి, సాంబిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, వినోద్, చలమయ్య పాల్గొన్నారు.

'కార్యదర్శులు అందుబాటులో ఉండాలి'

మండవల్లి ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీల్లో కార్య దర్శులు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కరరావు, జిల్లా కన్వీనర్ అప్పారావు అన్నారు. కార్యదర్శులు ఏ రోజు ఏ పంచాయతీలో అందుబాటులో ఉండేది తెలుపుతూ పంచాయతీ వద్ద నోటీసుల బోర్డులో ఉంచాలని సోమవారం ఎంపీడీవో రామలింగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు.


తుమ్మగూడెంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది


ముసునూరులో బాలికలకు మాత్రలు వేస్తున్న ఇవాంజలి

ఆరోగ్య సంరక్షణకే ఆల్బెండజోల్

నూజివీడు/చాట్రాయి/ముసునూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో సమగ్రాభివృద్ధికి ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు చేపట్టాలని నూజివీడు డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ ఆర్.లక్ష్మినారాయణరావు అన్నారు. నూజి వీడు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు డివార్మింగ్ మాత్రాలను అందించారు. నూజివీడు డివిజన్ పరిధిలోని ముసునూరు, ఆగిరిపల్లి, లింగ పాలెం, చాట్రాయి, చింతలపూడి తదితర మండలాల పరిధిలో మొత్తం 88,566 మందికి డివార్మింగ్ ట్యాబెట్లను అందించామన్నారు.డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. నూజివీడు మండలంలోని దిగవల్లి, మీర్జాపురం, గొల్లపల్లి పాఠశాలల్లో డివార్మింగ్ మందులను వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ గౌతమ్ తదితరులు విద్యార్థులకు లాంఛనంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అల్బెండజోల్ మాత్రలు వాడితే రక్తహీనత, ఎదుగుదల లోపాన్ని అధిగమించవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో అల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఎంఈవో బ్రహ్మాచారి, హెచ్ ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రమణక్కపేట పీహెచ్‌సీ పరిధిలో..

నులి పురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని వైద్యులు డాక్టర్ కరీముల్లా, షకీనా ఇవాంజలిలు అన్నారు. రమణక్కపేట పీహెచ్‌సీ పరిధిలో ఉన్న పాఠశాలల్లో 3117 మంది విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1331 మంది చిన్నారులకు మాత్రలను వేసినట్లు వైద్యులు కరిముల్లా తెలిపారు. ముసునూరు పీహెచ్‌సీ పరిధిలో 2834 మందికి, అంగన్‌వాడీల్లో 1332 చిన్నారులకు మాత్రలు వేసినట్లు వైద్యులు ఇవాంజలి తెలిపారు. ఆగిరిపల్లి మండలం సురవరం గ్రామంలో హైస్కూల్, తోటపల్లిలోని హీల్ స్కూల్లో నులిపురుగుల నివారణ మాత్ర లను విద్యార్థినీ, విద్యార్థులకు వేశారు.

అల్బెండజోల్ మాత్రలపై అవగాహన

కలిదిండి/ముదినేపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కలిదిండి పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైద్యాధికారులు జాహ్నవి, హేమంత్ నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ముదినేపల్లి, గురజ, దేవపూడి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శాంతిశ్రీ, తరిణి, వినయ్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది మండలంలోని హైస్కూళ్లు, ఇతర పాఠశాలల విద్యార్థులతో మాత్రలను మింగించి ప్రయోజనాలను వివరించారు.


చనుబండలోని వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉచిత కంటి ఆపరేషన్లకు 69 మంది ఎంపిక

చాట్రాయి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చనుబండలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 145 మందికి కంటి పరీక్షలు జరిపి 69 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించగా, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ప్రభుదాస్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల ధ్యక్షుడు సాయి, సర్పంచ్ జ్యోతి, ట్రస్ట్ అధ్యక్షుడు జె.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీబీ కెనాల్లో డెక్క, తూడు తొలగింపు పనులను పరిశీలిస్తున్న కలిదిండి డీసీ చైర్మన్ ఎం.భోగేశ్వరరావు

గుర్రపుడెక్క తొలగింపు

ముదినేపల్లి/కలిదిండి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పంటకాల్వల్లో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకంగా వున్న గుర్రపుడెక్క తొలగింపు పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. క్యాంప్ బెల్ ప్రధాన పంట కాల్వలో కాకర వాడ నుంచి బొమ్మినంపాడు శివారు వరకు పేరుకు పోయిన గుర్రపుడెక్కను ఎక్స్‌వేటర్‌తో తొలగించే పనులను రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. పెదగొన్నూరు డీసీ చైర్మన్ గుడిసేవ సురేష్‌బాబు, చేవూరు నీటి సంఘం అధ్యక్షుడు శాయిన ప్రసాదరావు, వడాలి సెక్షన్ ఏఈ సిద్ధార్థ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి.

పనుల పరిశీలన

కలిదిండి మండలంలో 20 పంచాయతీల తాగునీటి చెరువులకు నీరందించే సీబీ కెనాల్‌లో గుర్రపు డెక్క తూడు, చెత్త తొలగింపు పనులను చేపట్టినట్టు కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు తెలిపారు. పనులను సోమవారం ఆయన పరిశీలించారు.

రేపు ఆలయ వార్షికోత్సవం

ముసునూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం శివారు నాగేంద్రపురం సెంటర్‌లో ఉన్న నాగేంద్రస్వామివారి ఆలయ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు జరుగుతాయని అర్చకులు చిట్టిబాబు తెలిపారు.

మంత్రి పర్యటన వాయిదా

చాట్రాయి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుగూడెంలో సోమవారం సాయంత్రం జరగవలసిన నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పర్యటన అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. మళ్లీ పర్యటన ఎప్పుడు అనేది తరువాత తెలియజేస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

బాలరావమ్మ గ్రామోత్సవం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగిరిపల్లి గ్రామంలోని బాలరావమ్మతల్లి మాఘ పౌర్ణమి తిరునాళ్ళ మహోత్సవం మూడోరోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం సింగన్న గూడెం, నూగొండపల్లి గ్రామాల్లో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. తోటపల్లి, కనసానపల్లి గ్రామాల్లో కొలువైన బాలరావమ్మతల్లి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.


గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

బయోమెట్రిక్ విధానంలో ఎరువులు విక్రయించాలి : ఏడీఏ

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఇంటర్నల్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించింది. సహాయ వ్యవసాయ సంచాలకులు కోటా రామచంద్రాపురం ఏడీఏ బుజ్జిబాబు ఈ తనిఖీలను నిర్వహించారు. నూజివీడు మండల ఎరువుల డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ పోస్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో ఎరువులను విక్రయించాలన్నారు. ఎరువుల ధరలు, స్టాక్ నిల్వలు, రైతులకు కనిపించే విధంగా ప్రదర్శిం చాలన్నారు. డీలర్లు అందరూ అధీకృత డిస్ట్రిబ్యూటర్ల ద్వారా పొందిన స్టాకును మాత్రమే విక్రయించాలని సూచించారు. నూజివీడు మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ.చాముండేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాలు పరిశీలిస్తున్న అధికారులు

రైతులకు విశిష్ఠ గుర్తింపు సంఖ్య తప్పనిసరి : సూరిబాబు

ముసునూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను అందించనుందని, ఈ సంఖ్యను రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.సీహెచ్ సూరిబాబు కోరారు. సొంతంగా భూమి ఉన్న ప్రతిరైతు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ లేదా 1-బి, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబరును తీసుకుని గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలను వెళ్ళి రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) చేసుకోవాలని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే ఈ సంఖ్య నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475